# కొయ్యబొమ్మలు

కథ

వేంపల్లి గంగాధర్

"చూడు మునిస్వామి! నిన్ను రెండ్రోజులు లాకప్‌లో పెట్టినందుకు నాక్కూడా బాధగానే ఉంది. ఏం చెయ్యమంటావో నువ్వే చెప్పు. ఈ మధ్యనే పీడీ యాక్ట్ అనేది ఒకటొచ్చింది. దీని కింద అరెస్ట్ అయినోళ్లకు బెయిల్ రావాలంటే కూడా ఆరునెలలు పడుతుంది. ఇంకనైనా జాగ్రత్తగా ఉండండి. ఈ సంగతి మీ పల్లెలో వాళ్లకందరికీ చెప్పు'' పోలీస్ స్టేషన్‌లో కాలు మీద కాలేసుకొని బూట్లు ఆడిస్తా, కళ్లు ఎగరేస్తా చెప్పినాడు ఎస్సై సుధాకర్. చేతులు కట్టుకొని, మాసిన బట్టల్తో, విచారం నిండిన ముఖంతో నిలబడి ఉన్నాడు మునిస్వామి... ఎదురుగా.



'మరీ బతకలేకపోతే ఒక పని చెయ్యండయ్యా...ఎక్కడో ఒక చోట రోడ్డు పక్క రెండు గుంజలు పాతి మధ్య తాడు కట్టి నీ కూతుర్నో, కొడుకునో పైకెక్కించి దొమ్మరి ఆటనే ఆడుకోండి. డబ్బులు వస్తాయి. ఈ కొయ్య బొమ్మల పని చేసి జైళ్లల్లో పడేదానికంటే అదే మేలు కదా....ఏమంటావ్...'' ఎడంచేత్తో మీసాన్ని దువ్వుకున్నాడు ఎస్సై...రెచ్చగొడుతూ.

తనని కులం పేరుతో దూషిస్తున్న ఎస్సై పట్ల పట్టరాని ఆగ్రహం వస్తోంది. కానీ ఏం చేయగలడు?

తిరగబడలేని బలహీన బతుకులు...

మౌనంగా నిలబడిపోయాడు....బొమ్మలా....

కొయ్యబొమ్మలా...మునిస్వామి!

నరాల్లో నెత్తురు రగులుతోంది. కానీ చేతకాని తనం. కళ్లు మూసుకున్నాడు.

కన్నీళ్లు పొంగుకొచ్చాయి.


కళ్ల ముందు రకరకాల బొమ్మలు కన్పిస్తాఉండాయి. దేవుళ్లు...దేవతలు...వేంకటేశ్వరుడు, వినాయకుడు, కృష్ణుడు, మహావిష్ణువు, హనుమంతుడు, శివపార్వతులు, దశావతారాలు, లక్ష్మీ సరస్వతులు...ప్రత్యక్షమవుతున్నారు. వీళ్లనందరినీ తాను ఎందుకు సృష్టించాలి? ఎందుకు జైల్లో పడాలి?

రెండు రోజులు లాకప్ జీవితం గుర్తుకొచ్చింది.

కడుపులో తిప్పినట్లయింది. తానెప్పుడూ స్టేషన్ ముఖం కూడా చూసింది లేదు. అలాంటిది కటకటాల వెనుక రెండ్రోజులు గడపాల్సి వచ్చింది.

తన పట్ల, తను నమ్ముకున్న కళ పట్ల అసహ్యం వేస్తోంది. తనని ఏ దేవుడూ కనికరించలేదెందుకు? రకరకాల ఆలోచనలు పరిభ్రమిస్తున్నాయి.

***



'మాంచి బేరం తగిలింది. మద్రాస్ నుంచి వ్యాపారి వచ్చాడు. చూడు...ఆర్డర్ తీసుకో...నువ్వు బాగా బొమ్మలు చేస్తావు కాబట్టి నీ దగ్గరికే పిలుచుకొచ్చినా...' మునిస్వామిని పక్కకు తీసుకొచ్చి చిన్నగా చెవిలో చెప్పాడు వైకుంఠం.

'ఎంతిస్తాడంటా?' ప్రశ్నించాడు మునిస్వామి.

'ముప్ఫై వేల రూపాయలు. వినాయకుడి బొమ్మ కావాలట' చెప్పాడు వైకుంఠం.

కళ్ల ముందు కాసుల వర్షం కదలాడింది.

కానీ...కొయ్య ఎక్కణ్నుంచి వస్తుంది? ఆ ప్రశ్న ఆలోచనల్లోకి రాగానే నిరాశ ఆవహించింది.

'సరిపోదంటే చెప్పు...ఇంకో మూడు వేలు ఖర్చుల కోసం మాట్లాడి ఇప్పిస్తాలే...' బేరం పోగొట్టుకోవద్దు. నా కమీషన్ మరిచిపోవద్దు అనే ధోరణిలో చెప్పాడు వైకుంఠం.

ఇంటి బయట వేప చెట్టు నీడలో..తెల్లటి కారులో వ్యాపారి ఉన్నాడు. బేరం ఏదో ఒక విధంగా కుదిరితే అడ్వాన్సు కూడా అందుతుంది.

'సరే...నేను బొమ్మ చేసి ఇస్తాను' అని చెప్పడానికి ధైర్యం చాలడం లేదు మునిస్వామికి.

ఫారెస్టోళ్ల జీపు శబ్దమే చెవుల్లో ప్రతిధ్వనిస్తా ఉంది. ఎప్పుడొచ్చి ఇళ్ల మీద పడి సోదాలు చేస్తారోనని పల్లెలోని పనోళ్లందరూ ఆందోళన పడ్తా ఉండారు. ఇట్లాంటి పరిస్థితుల్లో కొత్త పనులు ఎవరు ఎంతిస్తే మాత్రం ఒప్పుకుంటారు? కానీ తనకు తప్పదు.

'ముందే చెప్తా ఉండాను మునిస్వామి....సిసలైన ఎర్రచందనం బొమ్మే కావాల... తేడా వస్తే బాగుండదు.. కస్టమర్ల దగ్గర నమ్మకం పోతే ఇద్దరి బిజినెస్‌లకూ ఇబ్బందే...' హెచ్చరిస్తా చెప్పినాడు వైకుంఠం.

తలాడించినాడు మునిస్వామి.

ఆ తర్వాత అడ్వాన్సు కొంత చేతికందింది.

మూడు నెలల గడువు కోరాడు మునిస్వామి.

ఒప్పుకున్నాడు వైకుంఠం. కారు కదిలింది మట్టి దారెంబడి ఎర్ర దుమ్ము రేపుకుంటా.

అంతా బాగానే ఉంది...మరి కొయ్య ఎలా?

'రేయ్...నాగులు, మంచి ఎర్రచందనం కొయ్య కావాల. మామూలుగా ఇచ్చే దానికంటే రెండు వేలు ఎక్కువే తీసుకో. తెచ్చిస్తావా?' పల్లెకు దిగదాల గొల్లపల్లెకు ఆనుకొని ఉండే కొట్టాల దగ్గర నాగులను కలిసి తన ప్రతిపాదనను పెట్టాడు మునిస్వామి...రహస్యంగా!


SREE SREE
SPECIALITY
Dental Cosmetic & Implant Centre



Dr. APPAJI
G.V.S.M.K
B.D.S., F.R.H.S., Implantologist (Manipal)

Replacement of missing Teeth by Implants and fixed Crown & Bridges (All Ceremic) & Implants ? correction of irregular Teeth. Root Canal Treatment or decayed Teeth (Painless). Treatment of bleedings gums, Halitosis (Bad ordor) with scaling, Root planing & flap surgeries. Cosmetic dentistry: Bleaching, Removal of Flurosis. Replacement of full set of Teeth & Implant dentures. Replantation after accident with new technology. Treatment of children (Age : 6 months onwards) teeth problems along with diet counseling.

TIMINGS : 9:30 a.m. to 1:30 p.m 5:00p.m. to 9.00p.m.
SUNDAY : 9:30 a.m. to 12:30 p.m.

#1-1-365/6, Near Andhra Cafe, Gandhinagar, Hyderabad. - 500 020.
Ph : 040-2766 2548, 9246521209,
Mobile : 9849018589 (R) : 040 - 2761 2038, 65544432.
E-mail : gvsmkappaji@yahoo.co.in

వాడు వెంటనే చొక్కా విప్పాడు. వెనక్కి తిరిగి వీపు చూపించినాడు. వాతలు...మాయని మచ్చలాగా... కన్పిస్తావుండాయి.

'రెండు నెళ్ల క్రితం లోపలేసి కొట్టినారు...సామీ... జూడు ఎట్టా పెరక్కచ్చినాయో వాతలు...ముందే టౌనుకు కొత్త ఫారెస్టాపీసరొచ్చినాడని అందరూ అనుకుంటా ఉండారు. నా చేత కాదు. నన్ను విడ్సిపెట్టి మీ పని మీరు జూసుకోండి....' అని నాగులు రెండు చేతులెత్తి దండం పెట్టినాడు.

వాడలా దండం పెట్టిన తర్వాత ఎప్పటిలాగానే మిలట్రీ మందు వాడి చేతుల్లో పెట్టడం మునిస్వామికి అలవాటే.

వాడు కూడా ఎప్పటిలాగే వద్దు..వద్దు...మందు మానేసినానంటూనే చేతులు రుద్దుకుంటా తీసుకున్నాడు పెదవులు తడిచేసుకుంటా.

మునిస్వామి ఊపిరి పీల్చుకున్నాడు.

నాగులు మందు బిగించి గొడ్డలి చేతబట్టి తూరుపు శేషాచలం కొండల కేసి బయలుదేరినాడంటే రెండ్రోజుల్లో కొయ్య వచ్చి కోత మిషను కాడికి చేరినట్లే లెక్క. వారి లెక్క తప్పదు. వానికిచ్చే లెక్క తగ్గితే వాడూ తగ్గడు. అంతా గొడ్డలి పదును వ్యవహారం! అందుకే వానితో ఎంత వరకో అంత వరకే. అంతకు మించి పెట్టుకోరు. కొండల్లో ఎర్రచందనం చెట్లను కొట్టడంలో వాడు మహాఘనుడు. ఎమ్మెల్యే తమ్ముడు ఎర్రచందనం వ్యాపారం చేసేటప్పుడు రాత్రి పగలూ అడవిలోనే ఉండి మాన్లు కొట్టుకొని కింద మోసుకొని వచ్చేవాడు. అట్లా ఎర్రబంగారు చందనాన్ని స్మగ్లింగ్ చేయడంలో నాగులుకు ఎంతో అనుభవం వుంది. మద్రాసులో పోలీసోళ్లు ఎన్నో సార్లు పట్టుకొని లోపలేస్తేద ఎమ్మెల్యే తమ్ముడే విడిపించేవాడు. లారీలకు లారీల లోడుకు కూలోళ్లను పెట్టి అడవిలో కొట్టిస్తాఉండేటోళ్లు. సగం చెట్లు ఎమ్మెల్యే ఖాతాలో చేరితే మరో సగం చెట్లు ఎంపీ బామర్ది ఖాతాలో చేరినాయి. ఫలితంగా అడవి ఖాళీ అయ్యే పరిస్థితి ఏర్పడింది.

ఎర్రచందనం స్మగ్లింగ్ లాభసాటి వ్యాపారం అయింది. కానీ బొమ్మల్ని తయారు చేసుకోవడానికి శెట్టిపల్లె కళాకారులు తనకలాడాతా ఉండారు. కొయ్య దొరకక!

అడవికానుకొని ఉంటారు. అక్కడే పుట్టారు. అక్కడే పెరిగారు. అక్కడే జీవిస్తా ఉండారు. మరి అడవి నుంచి వారిని వేరు చేస్తున్నదెవరు? వారి వనరులు వారికెందుకందడం లేదు?

***

శేషాచలం ఎగువ కొండలు....తూర్పు దిశగా... ఆకాశం కింద పచ్చటి పందిర్లు వేసినట్లు విస్తరించి ఉన్నాయి. తొలిజాము ఎండపడి అడవంతా తళతళా మెరుస్తా ఉంది. నునుపు తేలి ఆకాశాన్ని చుంబించే కొమ్మలతో ఎత్తుగా ఎదిగి పసుపు రంగు పూలతో నిండుగా విప్పారి ధీటుగా నిలబడినట్లున్న ఎర్రచందనం చెట్లు పడమటి గాలికి ఆగి ఆగి ఊగుతున్నాయి. సన్నని మద్ది చెట్లు, ఆకురాలిపోతున్న తపసి చెట్లూ గుసగుసలాడుకుంటున్నాయి. గడ్డిపొదల మధ్య నుంచి పుట్టిన జల ఊట సవ్వడి చేసుకుంటూ అటు పక్క నుంచి జాలువారుతోంది. ప్రశాంతమైన అడవి ప్రపంచంలోకి అడుగుపెట్టాడు నాగులు....గొడ్డలితో తిరుగుతున్నాడు. తనకు మునిస్వామి చెప్పి కొలతలుగల చెట్టు కోసం వెదుకుతున్నాడు. అలసిపోయిన నల్లటి ముఖమంతా అశాంతిగా ఉంది.

కాసేపటి తర్వాత ఒక నిర్ణయానికి వచ్చాడు. ఒక చెట్టు దగ్గర ఆగాడు. పైకి చూస్తూ. అరచేత్తో చెట్టు మొదలును కొట్టి చూశాడు నేర్పుగా. నీళ్లలోకి దిగే ముందు ఈతగాడు నీళ్లను పరీక్షించినట్లు. సంతృప్తి పడ్డాడు.

మద్రాసులో పోలీసోళ్లు ఎన్నో సార్లు పట్టుకొని లోపలేస్తేద ఎమ్మెల్యే తమ్ముడే విడిపించేవాడు. లారీలకు లారీల లోడుకు కూలోళ్లను పెట్టి అడవిలో కొట్టిస్తాఉండేటోళ్లు. సగం చెట్లు ఎమ్మెల్యే ఖాతాలో చేరితే మరో సగం చెట్లు ఎంపీ బామర్ది ఖాతాలో

వేటు...మొదటి వేటు పడింది.....

అడవంతా అదిరింది.

చెట్ల మీది పక్షులు బెదిరి ఎగిరాయి. కొమ్మల్లో అల్లుకున్న గూళ్లు కొన్ని కింద పడ్డాయి. పూలు రాలిపోతున్నాయి. కొమ్మలు రివ్వున ఊగుతూ పెనుగులాడుతున్నాయి.

వేటు....వేటు తర్వాత వేటు....శక్తి కొద్ది పడుతూనే ఉన్నాయి. ముక్కలు ముక్కలుగా చెట్టు విచ్చిన్నం....

కాసేపు కొట్టిన తర్వాత ప్లాస్టిక్ బాటిల్‌లోని నీళ్లు తాగాడు నాగులు...విరామంగా. బండరాయికేసి గొడ్డలి పదును చేసుకొని మళ్లీ కొట్టడం మొదలుపెట్టాడు.

ఆ పని అలా కొనసాగుతూనే ఉంది.

అప్పుడప్పుడు పని ఆపి ఫారెస్టోళ్లు ఎవరైనా వస్తున్నారేమోనని బెదురు చూపులు చూస్తా ఉండాడు. కొండలో పులి ఉందని ఎవరో చెప్పిన మాట గుర్తుకొచ్చినప్పుడు సన్నటి అలజడి...అరికాళ్ల కింద.

ఏదైనా అలికిడి అయితే భయపెట్టే అలజడి...ఆందోళన...అలాగే గొడ్డలి....వేటును దించుతోంది. చెట్టులోకి దిగుతోంది.

తాగిన మందు వాసన గుప్పుమంటోంది. చమటతో నల్లటి శరీరం మెరిసిపోతోంది. గస..గస...నుదుటి చమట తుడుచుకుంటూనే వాడు శ్రమిస్తున్నాడు. భయంకరంగా తలపడుతున్నాడు. 'చెట్టు కూల్చడం' వాడి లక్ష్యం. ఒక సుదీర్ఘ పోరాటం తరువాత వాడి ఆరాటం తీరింది. అడవంతా ఉలిక్కి పడేలా పెద్ద శబ్దం చేస్తూ....వీడ్కోలు పలుకుతూ... తన లోకం నుంచి వెరవుతూ చెట్టు నేల కూలింది.

నాగులు ముఖంలో కొత్త ఆనందపు వెలుగు.

***

వారం రోజుల తర్వాత కొయ్య, కోత మిషను దగ్గరకి చేరింది. మునిస్వామి అక్కడికే వచ్చినాడు.

'సామీ...దేవుని సాచ్చిగా చెప్తా ఉండాను. దీన్ని కొట్టడం ఒక పనైతే...కిందకు తీసుకురాను రెండు రోజులు పట్టింది. ఫారెస్టోళ్ల కళ్లలో యాడ పడ్తానోనని చెప్పి ఎంత సావు సచ్చినానో...కలీపొదల్ల దాచిపెట్టి నేను, మా తమ్ముడు గంగులన్న ఇద్దరం రాత్రిళ్లు మోసుకొని వచ్చినాం. దిగదాల కొచ్చేటప్పుడు మా వాడ్ని నాగుపాము గూడా కాటు వేస్తావుండె...ఇదే ఆఖరు సామీ ఇంగెప్పుడూ ఎర్రకొయ్య కోసం కొండకు పోను. ఇంగో వెయ్యి ఎక్కువీయాల్సిందే....' తన కష్టాలన్నీ చెప్పుకొచ్చినాడు నాగులు.

కొయ్యను చూసినాడు మునిస్వామి. దగ్గరకెళ్లి. 'మొదటి రకం కొయ్యనే...' సంతృప్తి పడినాడు. జేబు లోంచి డబ్బు తీసి లెక్క చూసి ఇచ్చినాడు.

'ఇంగో ఐదు నూర్లు...ఇయ్యి సామీ...' బతిమలాడుతూ అడిగినాడు నాగులు.

'రేపు ఇంటికాడికి రా....తీసుకుపోదువు...' తప్పించుకోవడానికి వీలు కాక చెప్పినాడు మునిస్వామి.

వాడు తలాడించి వెళ్లిపోయాడు.

కోత మిషనులో పని మొదలయ్యింది. పొట్టు రేగుతా ఉంది. శబ్దం...ముళ్ల చక్రం గిర్రున తిరుగుతా ఉంది. కొయ్య ఒక రూపాన్ని సంతరించుకుంటా ఉంది. నల్లటి చర్మం రాలిపోతూ ఉంటే ఎర్రటి కొయ్య బయటికొస్తా ఉంది. కుబుసం విడుస్తున్న పాములా. కోత మిషను నుంచి కొయ్య ఇంటి వసారాలోకి చేరింది. ఇక అసలు పని మొదలయ్యేది ఇక్కడే. మునిస్వామి భార్య బంగారమ్మ శుక్రవారం నాడు కొయ్యకు పసుపుకుంకాలతో పూజ చేసింది. వర్జ్యం పోయినాక చేతిలోకి ఉలి తీసుకున్నాడు మనసులో దేవుడికి దండం పెట్టుకుంటా. తనకిష్టమైన పని. తను నమ్ముకున్న వృత్తి. తండ్రి బాధ్యతగా నేర్పించిన విద్య. బతుకు తెరువును చూపిస్తున్న బొమ్మల కళ. కొయ్యలో రూపం కన్పిస్తా ఉంది. దేవుడు...వినాయకుడి రూపం కొయ్య లోపల జీవం నోసుకుంటా ఉంది. అవసరమైన భాగాలు మిగిలిపోతూ ఉంటే అనవసరమైన భాగాలు కొయ్య నుంచి రాలిపోతున్నాయి. తల్లి గర్భం లోపల బిడ్డ రూపొందుతున్నట్లు కొయ్య లోపల బొమ్మ ఆకారం నిర్మితమవుతా ఉంది. మునిస్వామి ఓ వైద్యుడిలా కష్టపడతా ఉంటే, కొయ్య తల్లిలా ప్రసవ వేదన పడ్తా ఉంది ఉలిదెబ్బలతో. ఇది కూడా ఓ పెనుగులాట. కొయ్య లోపల్నుంచి బొమ్మని వెలికి తీయడం ఒక సాహస కళ.

'ఏం...మునిస్వామి...దీనెమ్మ...ఊర్లో ఎవనికి పని లేకపోయినా....నీకు మాత్రం పని దొరుకుతాది. అదీ

చిన్నా చితకా పని గూడా కాదు. పాతికవేలు దాటితేనే బొమ్మ ఒప్పుకుంటావు. ఈ శెట్టిగుంటకి నువ్వే మొగోడివి... బీడి ముట్టించి నోటికొచ్చిందేదో బయట్నుంచే వాగుతా లోపలకి వచ్చినాడు సూరయ్య.

సూరయ్యను పల్లెలో అందరూ పెద్దయ్య అని కూడా పిల్చుకుంటారు. ఒకప్పుడు బొమ్మలు పని చేస్తా బాగా సంపాదించే బతికినోడు. కాలం చెడింది. కొడుకు నాగరాజు చేతికందినట్లే అంది కాలంలో కల్సిపోయినాడు. యూనివర్శిటీలో ఎవరో కులం కాని పిల్లను ప్రేమించినాడు. వాళ్లింట్లో అమ్మాయి తండ్రి వీళ్ల పెళ్లి చేయడానికి ఒప్పుకోలేదు. ఇంగేం చేస్తాడు? హాస్టల్లోనే తెల్లారుజామున ఫ్యానుకు ఉరిపోసుకొని చనిపోయినాడు. నాగరాజుకు కూడా కొయ్య బొమ్మల పని బాగా నేర్పినాడు సూరయ్య. ఒక్కగానొక్క కొడుకు అర్థాంతరంగా రాలిపోవడంతో సూరయ్య మానసిక పరిస్థితి విషమించింది.

నోటికొచ్చింది మాట్లాడుకుంటూ, కనిపించిన వారి దగ్గర బీడీలు, చిల్లర ఇప్పించుకుంటూ జీవితం గడిపేస్తున్నాడు. భూమి, ఇల్లు అమ్మి భార్య లక్షుమ్మ ఇద్దరి కూతుళ్లకు పెళ్లి చేసింది. సాధ్యమైనంత వరకూ సూరయ్యను ఇంట్లోంచి బయటకు పంపదు. వారానికో, రెండు వారాలకో వస్తాడు. వెనుకనే లక్షుమ్మ వచ్చి తీసుకెళుతుంది.

'...ఏముందిలే...పెద్దయ్య! ఊర్లో నీకంటే మొగోడు ఎవడుండాడు? మీసం దువ్వుకొని బతకాలని మాకు నేర్పింది నువ్వే కదూ...రా..రా...కూర్చో....'నవ్వుతూ పలకరించినాడు మునిస్వామి...ఉలి ఆడిస్తానే.

'సర్లే...సర్లే...రెండ్రూపాయలు చిల్లరియ్యి... గుట్కా కొనుక్కోవాల..' వసారాలో గోడకు ఆనుకున్నాడు సూరయ్య.

'ఇస్తాలే గానీ....ఒక మంచి పాటెత్తుకో...' అడిగాడు మునిస్వామి, సూరయ్య కంఠం వినాలనే కోరికతో.

'కూసి గోపరం మింత కురిసె వరసములూ
కురిసెనూ తిరుపతిలో కుంభ వరసములూ
కుంటాలూ కుంటాలు రెండు కుంటాలు
ఓటుకుంటా ఒకటి వైకుంఠమొకటి
బాటలు బాటాలూ రెండు బాటాలు
కాశీకి ఒక బాట-తిరుమలకొక బాట
కారములు కారములు రెండు కారములు
ఉప్పుకారమొకటి ఉపకారమొకటి...'

ఎత్తుకున్నాడు సూరయ్య. పాట ఒకటి...వెంటనే. ఊయల్లో పాపను ఊపుతున్న బంగారమ్మ కూడా పడి పడి నవ్వుతా ఉంది.

జేబులోంచి పది నోటు తీసి 'ఇదో పెద్దయ్య' అని అందించినాడు మునిస్వామి.

బంగారమ్మ నువ్వుతూనే ఉంది. ఆ తర్వాత పాట గుర్తుకు రాకపోయినా సూరయ్య కీలు గొంతు వినిపిస్తానే ఉంది...ఏదో రాగంతో. ఇంతలో లక్షుమ్మ వచ్చింది.

సూరయ్య భుజంపట్టుకొని తీసుకెళ్లబోయింది.

'రొంత సేపు ఉండనీలేమ్మా...ఏమైతాది?' అన్నాడు మునిస్వామి.

'వద్దులే నాయనా...బాగుండేంత సేపు బాగుంటాడు. తటక్కిన ఏది చేతిలో ఉంటే దాంతో విసిరేస్తాడు. ఆరోగ్యం బాలేదు గానీ...' బాధగా చెప్పి పిలుచుకొని పోయింది లక్షుమ్మ. కొయ్య బొమ్మలా సూరయ్య వెళ్లిపోయాడు.

మునిస్వామి చేతిలోని ఉలి శిల్పాన్ని చెక్కుకుంటా పోతా ఉంది. అవిశ్రాంతంగా.

***


ఊర్లోకి జీపొచ్చింది.

ఉలి చప్పుళ్లు ఆగిపోయాయి.

ఎక్కడి బొమ్మల పని అక్కడే నిలిచిపోయింది. క్షణాల్లో ఆ బొమ్మలకు సంచులు కప్పి దాచేశారు. భయం...భయంగా చూస్తున్నారు బిక్కు బిక్కుమంటూ. కానీ వచ్చింది ఫారెస్టోళ్ల జీపుకాదు. 'హస్త కళల ఉత్పత్తుల సంస్థ' అనేది తిరుపతిలో ఒకటుంది. దాని తాలుకూ జీపు అది.

'హమ్మయ్య....' అని ఊపిరి పీల్చుకున్నారు అందరూ. గ్రామ సచివాలయంలో మీటింగ్ పెట్టారు.

'ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఫోన్ వచ్చింది. మంచి బొమ్మ కావాలి. అమెరికా అధ్యక్షుడి పర్యటన వచ్చే వారంలో హైదరాబాద్‌లో ఉంది. మన రాష్ట్ర గౌరవాన్ని ప్రతిబింబించే లా మంచి కానుక ఇవ్వాలని నిర్ణయించారట. అందుకు మీరందరూ సహకరించి చక్కటి బొమ్మను చేయించి ఇవ్వాలి.' పొట్ట పైకొచ్చిన బెల్టును సరిచేసుకుంటూ చెప్పాడు అధికారి.




కళాకారులు ఎవ్వరూ మాట్లాడలేదు.

నిశ్శబ్దంగా ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. గతం గుర్తుకొస్తాఉంది. మంత్రులొస్తున్నారని చెప్పి, కలెక్టర్ అడిగాడని, ఎస్పీ చూడాలని అన్నాడని తాము నెలలు నెలలు కష్టపడి చెక్కిన బొమ్మల్ని తీసుకెళ్లే అధికారులు...డబ్బులు విషయానికి వచ్చేసరికి కన్పించరని కళాకారులందరికీ తెల్సిపోయింది. అధికారులను కాదంటే ఏమైనా హాని తలపెడతారేమోనని భయం కూడా వారి కళ్లల్లో కన్పిస్తా ఉంది.

'సరే..సరే మీ బాధ అర్థమైంది. కొయ్య బొమ్మకు కావలసిన డబ్బు ఏర్పాట్లు మేం చేస్తాం. మీరు మంచి బొమ్మ సిద్ధం చేయండి. సిఎం దగ్గరకి....మీ కళాకారుల తరపున ఇద్దరికి కలవడానికి కూడా అవకాశం కల్పిస్తున్నాం....' అని కళ్లద్దాలు సరిచేసుకుంటూ ఆ అధికారి చెప్పాడు.

కొంత సంతృప్తిగానే తోచింది....కళాకారులందరికీ!

ఇప్పటికప్పుడు కొయ్య బొమ్మ కావాలంటే ఎలా?

'దశవతారాల బొమ్మ కృష్ణయ్య దగ్గరుంది....' ఎవరో అన్నారు. దాన్ని అక్కడకి తెప్పించారు. చూడ ముచ్చటగా తీర్చిదిద్దబడి ఉంది. అధికారులు అందరూ ప్రశంసించారు.

అడ్వాన్సుగా మూడు వేలు ఇచ్చారు.

ఇరవై వేల విలువ చేసే కొయ్య బొమ్మ అది.

'మిగిలింది....పర్యటనలో ఇస్తామని' స్పష్టమైన హామీ ఇచ్చారు.

మునిస్వామి, కృష్ణయ్యలిద్దరికీ ముఖ్యమంత్రిని కలవడానికి అవకాశం కల్పిస్తామని కూడా చెప్పారు. ఆ తర్వాత రెండు, మూడురోజుల్లోనే ఏర్పాట్లన్నీ చకచక జరిగిపోయాయి. హైదరాబాద్ పర్యటన ఖరారైనప్పటి నుంచి కళాకారులందరూ కూర్చొని ఏవేవో ఆలోచనలు చేస్తూనే ఉన్నారు.

'ఎర్రచందనాన్ని ప్రభుత్వం కొని పేద కళాకారులకు అప్పు రూపంలో కొయ్యను అందజేస్తే బాగుంటుందని' తీర్మానించారు. ఈ మాటే అర్జీ కూడా రాసుకున్నారు. ముఖ్యమంత్రిని కలిసినప్పుడు ఇవ్వడానికి వీలుగా దశావతారాల బొమ్మతో హైదరాబాదుకు బయలుదేరారు.

అమెరికా అధ్యక్షుడు పాల్గొనే కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సాయంత్రం జరిగిన ఒక సమావేశంలో ఆయన్ను సన్మానించి శెట్టిగుంట శిల్ప కళాకారులు రూపొందించిన దశావతారాల శిల్పాన్ని ముఖ్యమంత్రి వారికి అందజేశారు. ఆయన దాన్ని స్వీకరించి వెనకవున్న సెక్యూరిటీకి క్షణాల్లోనే అందజేశాడు. అంతే.. వారి కళ గురించి ఎవరూ రెండు ముక్కలైన మాట్లాడుకున్నది గానీ, ప్రశంసించింది గానీ ఏమీలేదు. సభ ముగిసింది. మునిస్వామిని, కృష్ణయ్యని, ఆ రాత్రి పట్టించుకున్న వాళ్ళు ఎవరూ లేరు. ఎవరిపని వారికి. జేబులోని డబ్బు ఖర్చుపెట్టుకొని తిరుగు ప్రయాణంతో శెట్టిపల్లె చేరుకున్నారు.

'బుద్ధి వచ్చింది... ఇంకెప్పుడూ ఆ సభలకు వెళ్ళకూడదు.. మనల్ని ఎవడు పట్టించుకుంటారు?' అంటూ మునిస్వామి నిరాశ పడ్డాడు.

కృష్ణయ్య అయితే తిరుపతికి రావలసిన మిగిలిన సొమ్ముకోసం ఏ ఇరవై సార్లు తిరిగాడో... ఇంకో ఐదు

వేలు చేతిలో పెట్టి ఈసారి బడ్జెట్ మంజూరైన తర్వాత డిపార్ట్‌మెంట్ నుంచే చెక్ పంపిస్తామని చెప్పారు. కానీ వాళ్ళు పంపు తారనే నమ్మకం లేక కృష్ణయ్య లబోదిబోమని తల్లడిల్లాడు.

'నేను మూడునెలలు కష్టపడి ఆ దశవతారాల బొమ్మ తయారు చేస్తిని, ఈ కొడుకులు నన్ను నాశనం జేసినారు..' అనుకుంటూ కొయ్య పనికి కావలసిన కొరముట్లు అన్నీ అటకపైకి మూటగట్టి వేసినాడు. టౌన్లోని బట్టల షాపులో పనికి చేరినాడు.

***

రోజులు గడుస్తున్నాయి.

ఓ నడిరాత్రి పూట శ్వాస ఆడక ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు ముని స్వామి.

భార్య బంగారమ్మ ఆందోళన పడ్తా త్వరత్వరగా మంచి నీళ్ళు తెచ్చి ఇచ్చింది.

ఆరు బయట వేప చెట్టు అరుగు మీదికి తీసుకొచ్చి కూర్చోబెట్టింది. చల్లటి గాలి వీస్తోంది. పరిస్థితి కొంత ఊరటగా వుంది.

తెల్లారిం తర్వాత టౌన్లోని డాక్టర్‌ను కలిశాడు మునిస్వామి.

'...పెద్ద ప్రమాదం ఏమీ లేదు. కాకపోతే ముక్కు లోపల వాహిక దగ్గర కండ కొంత పెరిగింది. ఆపరేషన్ చేసి తీసేస్తే సరిపోతుంది..' చెప్పాడు డాక్టర్.. పరీక్షించి.

'ఆపరేషన్' అనే మాట వినగానే చెమటలు పట్టాయి.

'ఇబ్బందేం లేదు. ఈ మాత్రలు వాడు. నిదానంగానే ఆపరేషన్ చేద్దాం..' అన్నాడు డాక్టర్ పరిస్థితిని గమనించి.

అక్కడ్నుంచి వచ్చాడేగానే

మనసు మనసులో లేదు. ఈ విషయం భార్య బంగారమ్మకు కూడా చెప్పలేదు.

ఆపరేషన్ అంటే డబ్బుతో పని.

ఇప్పటికిప్పుడు డబ్బు అంటే తన స్థితికి కష్టం ఒప్పుకున్న కొయ్యబొమ్మ పూర్తయితే మద్రాసు వ్యాపారి డబ్బులిస్తాడు. అన్నీ పరిష్కారమౌతాయని అనుకున్నాడు మునిస్వామి.

ఆ రోజునుంచి పని వేగం మరింత పెంచాడు. మొండిది... ఎర్రచందనం కొయ్య... అందుకే దాన్ని ఉక్కు కొయ్య అనికూడా పిలుస్తారు. శిల్పరీతికి దాన్ని మల్చుకోవాలంటే ఓర్పు, నేర్పు కావాలి.

ఇట్నే త్వరత్వరగా బొమ్మపూర్తి చేయాలనుకొని సిద్ధపడి గోడుగోడున కన్నీళ్ళు పెట్టుకున్న రమణయ్య గుర్తొచ్చినాడు.

పెద్ద సైజు శిల్పం... తిరుమల వేంకటేశ్వరస్వామి నిలువెత్తు విగ్రహాన్ని తయారు చేస్తానని బెంగుళూరుకు చెందిన వ్యాపారులతో రమణయ్య ఒప్పందం చేసుకున్నాడు. ఇరవై అయిదు వేలకు మాట్లాడుకున్నారు. పని మొదలైంది.

వాళ్లక్కడ ఏదో పూజా కార్యక్రమం పెట్టుకున్నారట. త్వరత్వరగా పూర్తిచేసి ఇవ్వాలని ఒకటే గొడవ. ఫోన్ల మీద ఫోన్లు కొట్టడం.

మనుషుల మీద మనుషుల్ని పంపడం.

రమణయ్యకు కాళ్ళు చేతులు ఆడలేదు.

రాత్రి పగలూ కష్టపడి శిల్పాన్ని తయారు చేశాడు.

వాళ్ళు బొమ్మను తీసుకెళ్లడానికి వాహనాన్ని కూడా తెచ్చి ఇంటిముందు పెట్టారు.

బొమ్మకు పాలిషింగ్ జరుగుతోంది.

వాళ్ళు ఒకవైపు తొందరపడ్తావుండారు.

తెల్లారితే వాళ్ళ పూజాకార్యక్రమమని చెప్తున్నారు. రాత్రి ముగ్గురు మనుషుల్ని పెట్టి పాలిషింగ్ చేయిస్తున్నాడు రమణయ్య...

చివరికి...

జరగకూడనిదే జరిగింది.

వేంకటేశ్వరస్వామి ముక్కుకు పాలిషింగ్ చేస్తున్నపుడు ఉలి మోటు తగిలింది. అంతే...

ముక్కులేని వేంకటేశ్వరుడి ప్రతిమ మిగిలింది!

ఇంక ఆ బొమ్మ ఎందుకు పనికొస్తుంది?

వాళ్ళు తిట్టుకుంటూ వెళ్ళిపోయారు. కన్నీళ్ళతో ఈ సంఘటన శెట్టిగుంటలోని కళాకారులందరికీ ఒక

'ఏమైంది?' ఆత్రమాత్రంగా అడిగింది భార్య బంగారమ్మ.
'కొయ్య బొమ్మ యాడుంది?' – మళ్ళీ ఆమె..
వేటికి సమాధానమివ్వ లేదు మునిస్వామి.
మౌనంగా కూర్చుండి పోయాడు.
ఎదురుగా కొరముట్లు. ఉలి, రంపం, బాడిశ...
ఏం చేయాలి?
భయంభయంగా ఈ కొయ్య బొమ్మలపని చెయ్యడమా? మానడమా?

గుణపాఠంగా గుర్తుండి పోయింది. గతం గుర్తొచ్చి మునిస్వామి పని వేగం కొంత తగ్గింది.

ఉలి చీల్చుకుపోతోంది. కొయ్య కొత్తరూపాన్ని ధరిస్తోంది. శ్రద్ధగా.. తీక్షణంగా.. వినాయకుడి విగ్రహం నిర్మితమౌతావుంది.

తన చుట్టూ ఏం జరుగుతుందో కూడా పట్టించుకునే స్థితిలో లేడు మునిస్వామి.

ఎవరో కొత్త మనుషులు నలుగురు లోపలికి వచ్చారు.

కొయ్య బొమ్మ తయారవుతూ వుంది.

తలపైకెత్తి చూశాడు మునిస్వామి.

వాళ్ళనెప్పుడూ, ఎక్కడా చూసింది లేదు.

'బొమ్మలు కావాలా..' అడిగాడు ఉలి ఆడిస్తానే.

'కాదు.. నువ్వే..' చెప్పాడు ఎత్తుటి మనిషి.

ఆ తర్వాత తెలిసింది.. ఫారెస్టోళ్ళు ఊరిబయట జీపునుంచి పొలాల మీదుగా నడుచుకుంటూ వచ్చారని.. వూర్లోకి.

ఆ సమయంలో కొయ్యబొమ్మ చేస్తా పట్టుబడింది మునిస్వామి మాత్రమే. సగం పూర్తయిన బొమ్మతో పాటుగా జీపు ఎక్కాడు.

'ఎర్రచందనం కొయ్య' ఎలావచ్చిందో చెప్పమని అడిగారు.

మౌనం..

'బొమ్మకు అడ్వాన్సు ఎంత తీసుకున్నావు?'

మౌనం..

'ఇప్పటి వరకు ఎంత సంపాదించివుంటావు?'

మౌనం...

మట్టిరోడ్లో దుమ్ము రేపుతావుంది.. జీపు..

దుమ్ము.. ఎర్రటి దుమ్ము... కమ్ముకుంటావుంది..

మునిస్వామికి ఊపిరాడ్డంలేదు..

సన్నటి దగ్గుకూడా మొదలైంది.

టౌనుకెళ్లాక తెల్సింది ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కు కొత్త ఎస్పై సుధాకర్ వచ్చాడని.

వార్నింగ్ ఇవ్వడం కోసం ఇలా తమ వూర్లోకి వచ్చారని.

మునిస్వామికి రెండ్రోజుల లాకప్ జీవితం తప్పలేదు. తనతో పాటూ సగం పూర్తయిన గణపతి విగ్రహం కూడా జైల్లోనే శిక్షను అనుభవించింది.

ఆ తర్వాత.. ఎస్పై అన్నమాటలు.. దొమ్మరి ఆట ఆడుకొమ్మని ఇచ్చిన సలహా..

స్టేషన్ న్నుంచి మునిస్వామి బయటికొచ్చాడు.

కసి... బాధ... ఏం చేయాలి?

వూరికి బయలుదేరాడు.. టౌన్నుంచి!

'ఏమైంది?' ఆత్రమాత్రంగా అడిగింది భార్య బంగారమ్మ.

'కొయ్య బొమ్మ యాడుంది?' – మళ్ళీ ఆమె..

వేటికి సమాధానమివ్వ లేదు మునిస్వామి.

మౌనంగా కూర్చుండి పోయాడు.

ఎదురుగా కొరముట్లు. ఉలి, రంపం, బాడిశ...

ఏం చేయాలి?

భయంభయంగా ఈ కొయ్య బొమ్మలపని చెయ్యడమా? మానడమా?

ఏదో నిర్ణయానికి వచ్చిన వాడిలా పైకి లేచాడు.

సంచికి సామాన్లు సర్దుతున్నాడు.

'ఎక్కడికి? ఎందుకు సామాన్లు పర్దుతున్నారు?'

ఆమె కలవరపడి ప్రశ్నిస్తోంది.

'...వద్దు! మనం ఈ కొయ్యబొమ్మల పనిని నమ్ముకొని బతకలేం. టౌనుకు పోదాం. వెతికితే ఇంతకంటే మంచి పని ఏదో ఒకటి దొరుకుతుంది.. సామాన్లు సర్దు..' నిశ్చలమైన స్వరం.

కొయ్యబొమ్మలు... ప్రాణమున్న కొయ్యబొమ్మలు.. బతకడానికి నమ్ముకున్న కళను విడిచిపెట్టి కడుపు చేత పట్టుకొని టౌనుకు తరలి పోతున్న కొయ్యబొమ్మలు.

*

చిరునామా
వేంపల్లి గంగాధర్
4/432/ఎ, వివేకనంద నగర్,
కడప – 516 001. ఫోన్: